# కొల్లాపూర్‌లో గులాబీజెండా ఎగరేద్దాం

- అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే బీరం సతీమణి విజయమ్మ



లక్ష్మీపల్లిలో బీరం విజయమ్మను సన్మానిస్తున్న నాయకులు

చిన్నంబావి, నవంబర్ 2: రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి శ్రీరామ రక్ష అని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి విజయమ్మ అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంతో పాటు మండలంలోని లక్ష్మీపల్లిలో ఆమె నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆమెకు గ్రామాల్లోని మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ ప్రజల కష్టనష్టాలకు అనుగుణంగా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి తెలంగాణ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకువచ్చారన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిపారని గుర్తుచేశారు. కొల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించుకొని కొల్లాపూర్ కోటపై గులాబీ జెండాను ఎగరేద్దామన్నారు. బీఆర్ఎస్ పార్టీకి సంక్షేమ, అభివృద్ధి పథకాలే శ్రీరామ రక్ష అన్నారు. గ్రామాల్లోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి, బీఆర్ఎస్ పార్టీ, ఎమ్మెల్యే బీరం గెలుపులో భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వ పథకాలను గడపగడపకూ వివరించి ఓటును అభ్యర్థించాలన్నారు. ముందుగా ఆమెను నాయకులు ఆమెను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రామమ్మ, బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, చిన్నారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ముష్టి సత్యనారాయణ, పరమేశ్ ,గ్రామ ఉప సర్పంచు స్వామి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



చిన్నంబావి, లక్ష్మీపల్లిలో నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న బీరం విజయమ్మ

## హాస్టల్ విద్యార్థులకు పరుపులు పంపిణీ



పరుపులు అందుకున్న విద్యార్థులు

కొల్లాపూర్, నవంబర్ 2: పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ'ఏ'బాలుర వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన పరుపులను వసతిగృహ సంక్షేమాధికారి సత్యనారాయణయాదవ్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో కల్పిస్తున్న వసతులు, వస్తువులను సక్రమంగా ఉపయోగించుకొని విద్యలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో వసతిగృహం సిబ్బంది నారమ్మ, గుంతమ్మ, నవీన్‌కుమార్, హాస్టల్ వివిధ కమిటీల చైర్మన్లు శివరాం, రాజశేఖర్, వరప్రసాద్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సోమశిలకు ఎన్నికల వ్యయ పరిశీలకులు



బేరారాం చౌదరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఈఆర్వో శ్రీకాంత్

కొల్లాపూర్, నవంబర్ 2: రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయాలను పరిశీలించేందుకు గాను ఐఏఎస్ అధికారి హోదాలో ఉన్న బేరారాం చౌదరి గురువారం కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామానికి వచ్చారు. ఇక్కడి గెస్ట్‌హౌస్‌కు వచ్చిన ఆయనకు స్థానిక సహాయ ఎన్నికల అధికారి, తాసీల్దార్ శ్రీకాంత్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈయన వెంట పెద్దకొత్తపల్లి డిప్యూటీ తాసీసిల్దార్ రమేశ్, ఇతర అధికారులున్నారు.

## అంతర్‌జిల్లా చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు



జటప్రోల్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నపోలీస్ సిబ్బంది

పెంట్లవెల్లి, నవంబర్ 2: మండలంలోని జటప్రోల్ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్ పోస్ట్ వద్ద పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ఎస్సై బండారి సురేశ్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కోడ్ అమల్లో ఉన్నందున్న వాహనదారులు, ప్రయాణికులు శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీస్ అధికారులకు సహకరించాలన్నారు. ప్రజలు తమ అవసరాల కోసం నగదును తీసుకెళ్లే సమయంలో రూ.50వేలు మించితే, వాటికి సరైన ఆధారాలు చూపించాలన్నారు. లేని పక్షంలో ఆ డబ్బును సీజ్ చేస్తామన్నారు. అనుమతి లేకుండా మద్యం సరఫరా చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## జూరాలకు స్వల్ప వరద

ధరూరు, నవంబర్ 2 : జూరాల ప్రాజెక్ట్‌కు స్వల్ప వరద ప్రవాహం యథావిధిగ కొనసాగుతున్నది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రవాహం వస్తున్నది. నెట్టెంపాడు లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు, ఎడమ కాలువ ద్వారా 730 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా731 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

## హైలెవల్ వంతెనతో తీరనున్న కష్టాలు

- రూ.3కోట్లతో కేతేపల్లి నాగులకుంట వాగుపై బ్రిడ్జి నిర్మాణం
- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చొరవతో తుదిదశకు పనులు

పాన్‌గల్, నవంబర్ 2: తెలంగాణ ప్రభుత్వం వంతెనల నిర్మాణానికి పెద్దపీట వేసింది. వానాకాలం వస్తే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటేవారు. వనపర్తి– కొల్లాపూర్ ప్రధానరోడ్డుపై ఉన్న కేతేపల్లి గ్రామసమీపంలో వంతెన నిర్మించాలని తెల్లరాళ్లపల్లి, వల్లభాపూర్, చిక్కేపల్లి తదితర గ్రామాల ప్రజలు గత పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. కానీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచాక కేతేపల్లి గ్రామస్తులు చిరకాల కోరికైన వంతెన నిర్మించాలని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి సమస్యను విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే హైలేవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.3 కోట్లు రూపాయలు మంజూరు చేశారు. వాగులోతు ఎక్కువగా ఉండడంవల్ల పనులుగా నిర్మిస్తేనే భవిష్యత్ తరాలకు ఇబ్బందులు ఉండవని భావించి రూ.3కోట్ల వ్యయంతో హైలేవల్ బ్రిడ్జి నిర్మాణానికి 30మార్చి 2022న వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిలు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. వాగు ఉధృతి తట్టుకునేలా 8 పిల్లర్లతో పటిష్టంగా బ్రిడ్జి పనులు చేపట్టారు. ప్రస్తుతం హైలేవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. త్వరలోనే బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకరానున్న నేపథ్యంలో వాహదారులు, ప్రయాణికులు, ప్రజ లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### వర్షం వస్తే రాకపోకలు బంద్

కొల్లాపూర్–వనపర్తి ప్రధాన రోడ్డులో కేతేపల్లి శివారులోని నాగులకుంట వాగులో వరద పారడంతో కొన్నేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వర్షాకాలం వచ్చిందంటే రాకపోకలు నిలిచిపోయేది. కాల్వ దాటి అటు తెల్లరాళ్లపల్లి, కొల్లాపూర్ తదితర గ్రామాలకు వెళ్లాలంటే అనేక ఇబ్బందులెదురయ్యేవి. పంట పొలాలకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతితో పెట్టుకొని వాగు దాటాల్సి వచ్చేది. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి చొరవతోనే బ్రిడ్జీ నిర్మించారు.

– రాములు,కేతేపల్లి

### ఎమ్మెల్యే కృషి వల్లే బ్రిడ్జి మంజూరు

ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి కృషితోనే నాగులకుంట బ్రిడ్జీ నిర్మాణం పూర్తయ్యింది. ఏండ్లుగా పాలించిన వారెవరూ పట్టించుకోచుకోలేదు. వర్షాకాలంలో రైతులు, స్థానికుల అవస్థ దారుణంగా ఉండేది. బ్రిడ్జి నిర్మాణంతో ఆయా గ్రామాల ప్రజలకు ఊరట కలిగింది. ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– బీరయ్య, విండో డైరెక్టర్,పాన్‌గల్



కేతేపల్లిలోని నాగులకుంట వాగుపై చేపడుతున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణపనులు

## పోలింగ్ కేంద్రం పరిశీలన



బొల్లారంలోని పోలింగ్ కేంద్రం పరిస్థితులను తెలుసుకుంటున్న ఎంపీడీవో కతలప్ప

వీపనగండ్ల, నవంబర్2: అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలోని బొల్లారంలో పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీవో కతలప్ప గురువారం పరిశీలించారు. ఎన్నికల నిబంధనల మేరకు తాగునీరు, బాత్‌రూమ్ వినియోగం వంటి కనీస అవసరాల సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల రికార్డులు, అభ్యసన సామార్థ్యాలను పరిశీలించారు. అదేవిదంగా గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు విద్యార్థులకు సీజ్ టెస్ట్



అవగాహన కల్పిస్తున్న అధికారి శ్రీనివాస్ రెడ్డి

వీపనగండ్ల, నవంబర్3 : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 3, 6, 9వ తరగతి విద్యార్థులకు లాగ్వేజ్, గణితంలో సామర్థ్యాలను అంచనా వేసేందుకు నేడు ఉదయం సీజ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహణపై ఆయా పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ వెంకటేశ్ పాల్గొన్నారు.